సాక్షి
కరీంనగర్

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023

ఘనంగా గంగబోనం

కురుమ కులస్తుల కులదైవం బీరప్ప మహంకాళమ్మ బోనాల జాతరలో భాగంగా శనివారం ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో గంగబోనం ఘనంగా నిర్వహించారు. డోలు, మేళతాళాలతో వీరగంధం, ప్రత్యేక వేషధారణలతో బీర్లవారు ర్యాలీగా బయలుదేరి బీరప్పకమాన్, మల్కాపూర్ సంతోష్‌నగర్, శ్రీహరినగర్, రాంనగర్ ద్వారా పద్మనగర్ బైపాస్‌వరకు వెళ్లారు. ఆచారం ప్రకారం బావిలో దాచిన అమ్మవారిని రాత్రి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు జరిపారు.

– కరీంనగర్ కల్చరల్



గంగబోనంతో కురుమ కులస్తులు

న్యూస్‌రీల్

రైతుల సమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్ సర్కార్

- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



కరీంనగర్‌టౌన్: రైతు సర్కార్ అని చెప్పుకునే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతాంగ సమస్యలు పట్టించుకోవడం లేదని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. శనివారం డీసీసీ కార్యాలయంలో అన్నిమండలాల ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 20రోజుల క్రితమే రైతులు కోతలు ప్రారంభించి ధాన్యాన్ని ఐకేపీ సెంటర్లకు తరలించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక, జాగ్రత్తలు లేక ఐకేపీ సెంటర్ల ప్రారంభంలో జాప్యం చేయడం వల్ల అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మొలకలెత్తిన, తేమ ఉన్న ధాన్యాన్ని అధికారులు ఎలాంటి తరుగు లేకుండా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, రైస్ మిల్లర్లు రైతుల వద్ద నుంచి ఎలాంటి దోపిడీ చేయకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, నాయకులు మేనేని రోహిత్ రావు, వెన్న రాజమల్లయ్య, మడుపు మోహన్, నాగి శేఖర్, మల్యాల సుజిత్ కుమార్, కాడే శంకర్, సాహెబ్ హుస్సేన్, రామిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కరించాలి



కరీంనగర్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గత ఆర్థిక సంవత్సరం 2022–23కు సంబంధించిన ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జెడ్పీ జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ బిల్లులు, ఈఎల్, సరెండర్ బిల్లులు, వేతన సప్లమెంటరీ బిల్లులు తదితర బిల్లుల సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్ రావు జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయులకు సంబంధించి వివిధ రకాల బిల్లులు ఆర్థిక సంవత్సరం గడిచిపోయినా కూడా చెల్లింపులు జరగకపోవడం వలన ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్‌ను తెలంగాణా మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ కర్ణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ అహ్మద్, జిల్లా ప్రధాన ఆసుపత్రి ప్రెసిడెంట్ తుమ్మల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జవ్వాజి హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శివకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సభ్యులు శ్యామ్ సుందర్, వెంకటేశ్, స్వప్న, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటలో రేషన్ డీలర్లు

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్లు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణకు సన్నద్ధమవుతున్నారు. గౌరవ వేతనం, కమీషన్ పెంపు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు వంటి కీలకాంశాలే ప్రాతిపదికగా పోరాటానికి సంఘటితమవుతున్నారు. ఆదివారం నగరంలో ఉమ్మడి జిల్లాలోని డీలర్లంతా గౌరవ వేతన సాధన పేరుతో సమావేశమవుతుండగా అపరిష్కృత సమస్యల పరిష్కారం ఏజెండాగా ముందుకు సాగనున్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల డీలర్లు సభలో పాల్గొననున్నారు. రాష్ట్ర రేషన్ డీలర్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ప్రధాన సమస్యలను చర్చించనున్నారు. తీగలగుట్టపల్లిలోని రంగినేని గార్డెన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్ తెలిపారు. డీలర్లు హాజరు కావాలని కోరారు.

'జగిత్యాల' మామిడి

వేసవి సీజన్ పండు మామిడి. తినేందుకు, పచ్చడికి మామిడిని వాడుతుంటారు. బంగిన్‌పల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడి కాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. మామిడి ఎగుమతికి జగిత్యాల కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. నాణ్యత, రుచి ఉండడంతో కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతోంది.


– వివరాలు 6లో...







శుక్రవారం రాత్రి రవాణా అధికారులు నిలిపిన లారీ



ఓ లారీ యజమాని ప్రైవేట్ వ్యక్తికి కొట్టిన ఫోన్ పే

పైసా వసూల్!

జిల్లా ఆర్టీఏలో అవినీతి పర్వం

- వాహన తనిఖీల్లో ప్రైవేటు సైన్యం
- ఆన్‌లైన్ ద్వారా అవినీతి దందా
- అర్ధరాత్రి లారీల వద్ద భారీగా వసూళ్లు

తిమ్మాపూర్(మానకొండూర్): ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే శాఖల్లో రవాణాశాఖఒకటి. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై తిరిగే వాహనాలను తనిఖీ చేస్తూ.. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జరిమానాలు విధిస్తుంటారు. ఆ జరిమానాను ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తుంటారు. అయితే కరీంనగర్ ఆర్టీఏ పరిధిలోని కొందరు అధికారులు తనిఖీల్లో విధిస్తున్న జరిమానాలు ప్రభుత్వ ఖాతాలో జమచేయకుండా తమ జేబులు నింపుకుంటున్నారు. అవినీతి సొమ్మును నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులను వెంటేసుకుని గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు.

కరీంనగర్‌కు ప్రత్యేక గుర్తింపు

రవాణాశాఖ విధించే లక్ష్యసాధనలో కరీంనగర్ ఆర్టీఏ ఆఫీసుకు మంచి పేరుంది. అయితే శాఖాపరమైన టార్గెట్‌లోనే కాకుండా సొంత ఖజానాను నింపుకోవడంలోనూ కరీంనగర్‌లోని పలువురు ఎంవీఐలు ముందువరుసలో ఉన్నారు. తనిఖీల్లో మూడు లారీల సొమ్ము ప్రభుత్వానికి అందిస్తే ఆరు లారీల సొమ్ము సొంత ఖాతాలో వేసుకుంటున్నారు.

రాత్రిపూటనే తనిఖీలు

జిల్లాలో రాత్రిపూట వాహనాలు తనిఖీలు చేస్తున్న అధికారులు ప్రధానంగా లారీలపై దృష్టి పెడుతున్నారు. ఓవర్ లోడ్ వాహనాలను ఆపుతూ కేసులు(చెక్ రిపోర్టు) రాయకుండా బేరసారాలు ఆడుతూ అందినకాడికి దండుకుంటున్నారని డ్రైవర్లు పేర్కొంటున్నారు. ఇద్దరు ఎంవీఐలైతే ఏకంగా ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అడ్డూ అదుపులేకుండా అక్రమవసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వసూళ్లు నగదురూపంలో కాకుండా తమకు తెలిసినవారి పేరిట గూగుల్‌పే, ఫోన్ పే ద్వారా ఖాతాలో వేసుకుంటున్నారు. గతంలోనూ ఓ అధికారి ఫోన్‌పే ద్వారా డబ్బు తీసుకొని దొరకడంతో బదిలీ పేరుతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నఉన్నా.. తాధికారులు అతడికి మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు.

నెలనెలా మామూళ్లు

వాహనాలు తనిఖీచేసే అధికారులు రోడ్డెక్కితే చాలు వసూళ్ల దందాను జోరుగా సాగిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే కేసులు రాస్తున్నారు. వాహనం సీజ్‌చేస్తారనే భయంతో చాలామంది రాజీకి వచ్చి మామూళ్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రవాణా అధికారులు తాము చేసే అవినీతిలో చేతికిమట్టి అంటకుండా ప్రైవేటుసైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆర్టీఏలో హోంగార్డులున్నా ప్రైవేటు వ్యక్తులకు తనిఖీల సమయంలో ఎందుకు అనుమతినిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రైవేటువ్యక్తులు వాహనదారులతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు.

వందల సంఖ్యలో ఇసుక లారీలు

జయశంకర్ భూపాలపల్లి, పెద్దల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీలు నడుస్తున్నాయి. ఆర్టీఏ అధికారులు ఆపకుండా ఉండేందుకు ఒక్కో లారీ యజమాని నెలకు రూ.5,500 మామూలుగా ముట్టజెప్పుతున్నట్లు సమాచారం. మామూళ్లు చెల్లించని లారీలను ఆపుతూ అందినంత వసూలు చేయడం, లేకుంటే కేసులు రాయడం కరీంనగర్ ఆర్టీఏలో పరిపాటిగా మారింది.

ఉన్నతాధికారులకు తెలిసే..

రవాణశాఖలో పలువురు ఎంవీఐల అవినీతి బాగోతం ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందా... లేదా అన్న విషయం ప్రశ్నార్థకమే. రోడ్డుపై వాహనాల తనిఖీల్లో ఎంవీఐలు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి గతంలో పలుమార్లు వెళ్లిందని పలువురు గుసగుసలాడుతున్నారు. అయినా వసూళ్ల పర్వం కొనసాగడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఎంవీఐల ప్రైవేటు సైన్యం వినియోగంపై, వారి ఆన్‌లైన్‌లో వసూళ్ల బాగోతంపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవినీతి అక్రమాలకు లైసెన్సు ఉందన్నట్లుగా వ్యవహరిస్తున్న పలువురు ఎంవీఐల తీరుపై అటు రవాణాశాఖ ఉన్నతాధికారులు, ఏసీబీ అధికారులు నజర్‌వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఓవర్ లోడ్ వాహన తనిఖీల్లో అధికారులు ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం. ఈ విషయం నా దృష్టికి రాలేదు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పకుండా తీసుకుంటాం.

– చంద్రశేఖర్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ ధర్నా



కొత్తపల్లి(కరీంనగర్): వడగండ్ల వానల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో వరికంకులు ప్రదర్శిస్తూ ధర్నా చేపట్టారు. వైఎస్సార్టీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కె.నగేష్ మాట్లాడుతూ లక్షలాది మంది రైతులు, కౌలు రైతులు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి పంటలను సాగుచేస్తే చేతికందే సమయంలో అకాల వర్షాల మూలంగా నష్టం వాటిల్లడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని రైతులను పక్కన బెట్టి ఇతర రాష్ట్రాల రైతులపై దృష్టి సారించడం దుర్మార్గమని మండిపడ్డారు. నష్టపోయిన వరి, మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కె.వెంకటరమణారెడ్డి, నీరజ, రియాజొద్దీన్, రాజయ్య, డా.శివరాం, రవీందర్‌రెడ్డి, ఆరీఫ్, శ్రీనివాస్, మల్లారెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు, సునీల్, సాదిక్ బలాల,ఆర్. శ్రీనివాస్, ఆర్.కవిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు మహోద్యమం



కరీంనగర్: రాష్ట్రంలో అమలుపరుస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దుకు రాబోయే రోజుల్లో మహోద్యమం చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్దరించే వరకు పోరాటం ఆగదని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు హరిక్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే ఐదు రాష్ట్రాలు రాజస్థాన్, పంజాబ్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రద్దు చేసి ఓపీఎస్ పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మే నెలలో ఉద్యమ కార్యాచరణతో (రెండవ వారంలో) పట్టభద్రుల ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం, మే నెల చివరి వారంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ, హైదరాబాద్‌లో నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నామన్నారు. సంఘం నాయకులు నాగరాజు, రామంచ రవీందర్, తిరుపతి, అశోక్‌కుమార్, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలగందులలో నాట్య దినోత్సవ సంబరాలు

కొత్తపల్లి: అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ సజ్జప్ప కళాక్షేత్రం ఆధ్వర్యంలో నాట్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ షర్మిల తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- జాబితాలో సవరణలను పక్కాగా నిర్వహించండి
- ప్రతీవారం పొలిటికల్ సమన్వయ సమావేశం
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి రవికిరణ్

కరీంనగర్ అర్బన్: తప్పులకు ఆస్కారం లేని కచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్ చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఎన్నికలు సజావుగా జరగాలంటే ఓటరు జాబితా స్పష్టంగా ఉండాలన్నారు. ఓటరు జాబితా నుంచి చనిపోయిన, వలసపోయిన ఓటర్ల వివరాలను తొలగించడంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఓటరు చనిపోయిన క్రమంలో మరణ ధ్రువీకరణ ఆధారంగా.. అదీ లేకుంటే వారి కుటుంబ సభ్యుల ద్వారా ధ్రువీకరించుకోవాలని తెలిపారు. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో ఓటర్ జాబితాలో ఉన్న వారు ఇంటివద్ద లేకపోవడంతో వారిని వలసవెళ్లిన వారిగా భావించరాదని, రిజిష్టరు పోస్టు ద్వారా లేఖ పూర్వకంగా తెలియజేసిన తరువాతే జాబితా నుంచి తొలగించాలన్నారు. మే 15లోగా డెలిషన్ నివేదికను అందించాలని తెలిపారు. ఓటరుగా గుర్తింపు పొందిన వారందరికి ఎపిక్ కార్డులను అందించాలని, ఒకే చిరునామాతో నమోదైన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, మార్పులు చేపట్టాలని తెలిపారు. డేటా ఎంట్రీలో ఏర్పడే సాంకేతిక సమస్యలను తెలియజేయాలన్నారు. ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో పొలిటికల్ సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల అధికారి హమీద్, అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్, డీఆర్డీవో శ్రీలత, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్ కుమార్, హరిసింగ్, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన జవహర్ నవోదయ పరీక్ష

చొప్పదండి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జవహర్ నవోదయలో ఆరో తరగతి అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు 7,730 మంది దరఖాస్తు చేసుకోగా, 6,845 మంది హాజరయ్యారని విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం

- 3 ఎజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం
- రూ.147 కోట్ల నిధుల మంజూరుకు నివేదికలు పంపించాం
- మేయర్ సునీల్‌రావు



సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. మేయర్ సభా అధ్యక్షతన కమిషనర్ సేవా ఇస్లావత్ సమక్షంలో 3 ఎజెండా అంశాలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

సభ దృష్టికి సమస్యలు

సర్వసభ్య సమావేశంలో ప్రశ్నోత్తర సమయంలో పాలకవర్గ సభ్యులు డివిజన్ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభా దృష్టికి తెచ్చారు. నగరంలో కుక్కలు, పందులతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కొందరు కార్పొరేటర్లు మరోసారి ఏకరువు పెట్టారు. కాగా ప్రజాసమస్యల పై కార్పొరేటర్లు అందించే సమాచారం, ఫోన్ కాల్స్‌కు స్పందించి సమస్యలను వచ్చే కౌన్సిల్ సమావేశంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో సమావేశం ముగించారు.

అన్నిరంగాల్లో నగరం అభివృద్ధి

మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ సహకారంతో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. స్మార్ట్‌సిటీ నిధులు, నగరపాలక సంస్థ వివిధ గ్రాంట్ల నిధులతో నగర వ్యాప్తంగా అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. వివిధ గ్రాంట్ల నిధులతో విలీన గ్రామాల డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో రూ.147 కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపించామని వెల్లడించారు. మరో రూ.120 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు టెండర్ ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. ప్రధానంగా మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి రెండున్నరేళ్లుగా రోజూ నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

టాయిలెట్స్‌కు తాళాలు

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కూరగాయాల మార్కెట్‌లో టాయిలెట్స్ లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం జరుగుతున్న కలెక్టర్ ఆడిటోరియంలో వీధి వ్యాపారులు ధర్నా నిర్వహించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కామధేనువు కూరగాయాల మార్కెట్‌లో దాదాపు 90 శాతం మంది మహిళ వీధి వ్యాపారులున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌సిటీలో భాగంగా టాయిలెట్స్ ఏర్పాటు చేసి వాటిని ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో మహిళలు టాయిలెట్స్‌కు వెళ్లిన ప్రతీసారి పది రూపాయలు వసూలు చేస్తున్నారు. పురుషులకు ఉచితంగా అవకాశం ఉండగా.. మహిళలకు మాత్రం రుసుము వసూలు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఒక్కో మహిళ సుమారు రూ.50 వీటికే ఖర్చు చేస్తున్నారు. వారు సంపాదించే అతి తక్కువలో వీటికి ఎక్కువ భాగం పోతుండడంతో వీధి వ్యాపారులు స్థానిక 49 డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్‌కు విన్నవించారు. దీంతో మహిళ వీధి వ్యాపారులతో కలిసి కార్పొరేటర్ శనివారం సర్వసభ్య సమావేశానికి వచ్చారు. వారు ఎదుర్కొంటున్న సమస్యను కార్పొరేటర్ సభ ముందు ఉంచి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో వారిని బయటకు పంపించేశారు. బయటకు వచ్చిన కార్పొరేటర్ మహిళ వీధి వ్యాపారులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాత్రి 8 గంటలకే టాయిలెట్స్ మూసి వేస్తున్నారని ఎక్కడికి వెళ్లినా సీసీ కెమెరాలు ఉండడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి టాయిలెట్స్ నిర్మించాలని కోరారు.



ధర్నా నిర్వహిస్తున్న మహిళలు, కార్పొరేటర్

క్లుప్తంగా

ధాన్యం తూకంలో వేగం పెంచాలి



శంకరపట్నం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో వేగం పెంచాలని డీసీవో శ్రీమాల అన్నారు. మండలంలోని తాడికల్, కేశవపట్నం మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం అకాలవర్షంతో రంగుమారిందని, రైస్‌మిల్లర్లు నిరాకరిస్తున్నారని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రంగుమారిన ధాన్యం దిగుమతి చేసుకోవాలని మిల్లర్లుకు సూచిస్తామని డీసీవో రైతులకు హామీ ఇచ్చారు.

హోంశాఖ ఏజీపీగా సాయిరాం



కరీంనగర్ క్రైం: రాష్ట్ర హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేస్తున్న పి.సాయిరాంను ప్రస్తుతశాఖ నుంచి మరోశాఖకు మార్చుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైకోర్టులో ఉన్నత విద్యా వ్యవహారాలు చూస్తున్న సాయిరాం మున్నాను తాజాగా హోంశాఖ ఎఫైర్స్ ఏజీపీగా నియమించారు.

ఏఆర్ అడిషనల్ డీసీపీగా భీమ్‌రావ్



కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఏఆర్ విభాగం అడిషనల్ డీసీపీగా భీమ్‌రావ్ నియామకం అయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తున్న భీమ్‌రావ్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. చాలాకాలంగా కరీంనగర్ ఏఆర్ అడిషనల్ డీసీపీ పోస్టు ఖాళీగా ఉంది.

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం: ధర్మారం మండలం కొత్తపల్లికి చెందిన ముచ్చెర్ల బక్కయ్య(52) ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి శనివారం మరణించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బక్కయ్య కొత్తపల్లిలో ఉంటూ సమీపగ్రామం బొమ్మారెడ్డిపల్లి మామిడితోటలో పనిచేస్తున్నాడు. తోటకు పనికి వెళ్లిన బక్కయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించినట్లు మృతుడి అల్లుడు ఎలుక రాజయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

ఎలిగేడు: ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల మల్లేశం (47)అనే గీతకార్మికుడు తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి కిందకు దిగుతున్న క్రమంలో మోకు జారి చెట్టుపైనుంచి పడటంతో ఎడమ చేయి విరిగింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. మల్లేశం కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మికులు కోరారు.

‘జగిత్యాల’ మామిడి

- మామిడి ఎగుమతికి కేరాఫ్ జగిత్యాల
- ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్
- నాణ్యత, రుచితో కొనుగోలుకు వ్యాపారుల పోటీ
- ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200కోట్ల వ్యాపారం

సండే స్పెషల్

జగిత్యాలఅగ్రికల్చర్: బంగినప్పల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. దేశవిదేశాల్లో ఎక్కడున్నా.. సీజన్‌లో జగిత్యాల నుంచి వచ్చిన మామిడిపండును రుచిచూడక మానరు. జగిత్యాల మామిడికి రుచి, పరిమాణంలో ప్రత్యేకత ఉంటుంది. అందుకే దేశంలోని అన్ని రాష్ట్రాలకు, విదేశాలకు సీజన్‌లో టన్నుల కొద్ది మామిడికాయ ఎగుమతి అవుతుంది. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతుంది.



లారీల్లో తరలిస్తున్న మామిడికాయలు

వైఎస్సార్ ఏర్పాటు చేసిన మార్కెట్

మొన్నటి వరకు కల్లోల ప్రాంతంగా ముద్రపడిన జగిత్యాల నేడు మామిడి రుచులతో దేశ,విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి ప్రోద్బలంతో జగిత్యాలలో రాజీవ్‌గాంధీ మామిడి మార్కెట్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం మామిడి మార్కెట్లలో వసతులు కల్పిస్తుండడంతో మరింత డిమాండ్ ఏర్పడింది. జగిత్యాల మామిడి మార్కెట్‌తో పాటు మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి ఏటా రూ.200కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది.



మామిడికాయలను ప్లాస్టిక్ ట్రేలో నింపుతున్న కూలీలు

ఈసారి తగ్గిన దిగుబడి

రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా ఢిల్లీవరకు మామిడి ఎగుమతి అయ్యింది. మార్కెట్లోని 88మంది కమీషన్ ఏజెంట్లు ఇతరరాష్ట్రాల వ్యాపారులకు మామిడిని పంపిస్తుంటారు. ఈ ఏడాది మామిడికాయకు మంగు ఏర్పడటం, కాయలు తక్కువగా ఉండటంతో వ్యాపారం కాస్త తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తీర్ణం ఉండగా, కనీసం 1.50లక్షల మెట్రిక్ టన్నుల మామిడికాయ రావాల్సిఉండగా.. పంటనష్టంతో సగం దిగుబడే వచ్చే అవకాశముంది.

జగిత్యాల మామిడికి గిరాకీ ఎందుకంటే?

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నూజివీడు, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, తిరుపతి, జగిత్యాలలో మామిడి మార్కెట్లు ఉన్నాయి. దేశం మొత్తం దిగుబడుల్లో సగంవాటా రెండు తెలుగు రాష్ట్రాలదే. ఇందులో 10–15శాతం వాటా జగిత్యాల మామిడిదే ఉంటుంది. ఈ ప్రాంతంలోని ఎర్రనేలలు మామిడిపంటకు అనుకూలమైనవి. కాయ రంగు, రుచి బాగుంటుంది. నీటివసతి కారణంగా పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఇక్కడి మామిడికాయలు రవాణాలో డ్యామేజీ కావు. ఎన్నిరోజులైనా కాయ నాణ్యతగా ఉంటుంది. ఢిల్లీ వంటి మార్కెట్లలో జగిత్యాల కాయరాగానే వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడుతుంటారు. రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా జగిత్యాల నుంచి దాదాపు 3–4 వేల మెట్రిక్ టన్నుల మామిడికాయ ఢిల్లీకి ఎగుమతైంది.

మంచి రుచితో విదేశాలకు

జగిత్యాల జిల్లాలో 50వేల ఎకరాలు, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లో మరో 30వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. బంగినప్పల్లి, హిమాయత్, దశేరీ రకాలనే ఇక్కడి రైతులు సాగు చేస్తుంటారు. కాయలను నైపుణ్యం గల ఇతర రాష్ట్రాల కార్మికులు గ్రేడింగ్ చేసి, ఢిల్లీకి పంపిస్తున్నారు. అక్కడి ఎగుమతి వ్యాపారులు గల్ఫ్‌దేశాలైన దుబాయ్, ఖతర్, మస్కట్, సౌదీ, బహ్రెయిన్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్, నేపాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, జమ్ముకాశ్మీర్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, వారాణాసీ, అలహాబాద్, ఛండీఘర్, నాగ్‌పూర్, నాసిక్, ముంబై, చంద్రపూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు ఇక్కడి సరుకు ఎగుమతి అవుతుంది. దశేరి రకం హైదరాబాద్, బెంగళూర్, ముంబయి వంటి మెట్రోసిటీలకు ఎగుమతవుతోంది.

రైతుకు లాభం అంతంతే..

ఈ పంటసాగులో రైతులకు లాభం అంతంతే. ఓపెన్ మార్కెట్ లేకపోవడం, కమీషన్ ప్రతిపాదిక వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రేటు పెట్టి కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులదే పైచేయి అవుతోంది. రాటన్, సూట్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు నేరుగా నాగ్‌పూర్ మార్కెట్‌కు కాయలు తీసుకెళ్తున్నారు.

ధర లేదు



ఏటా మామిడికాయలను మార్కెట్‌కు తీసుకువస్తున్నప్పటికీ సరైన ధరరావడం లేదు. జిల్లా అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనబడటం లేదు. ఈ ఏడాది ఓ వైపు రేటు రాకపోవడమే కాకుండా, మరోవైపు కాయకు మంగు వచ్చి నల్లగా మారాయి. అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి.

– రవీందర్‌రెడ్డి, రైతు, రాయికల్

విదేశాలకు వెళ్తుంది



జగిత్యాలకాయకు అన్ని రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ వ్యాపారులు కొనుగోలు చేసిన కాయ ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి విదేశాలకు వెళ్తుంది. జగిత్యాలకు చెందిన కాయ తాజాగా, పరిమాణంలో పెద్దగా కనబడటంతో చాలామంది కొనుగోలు చేస్తుంటారు.

– ఎండీ మోయిన్, మామిడి వ్యాపారి, జగిత్యాల

జగిత్యాల మామిడి బ్రాండ్



జగిత్యాల మామిడి అంటేనే ఓ బ్రాండ్. నాణ్యతతో పాటు రుచిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జగిత్యాల మామిడి మార్కెట్‌ను తెలంగాణలోనే ఓ మోడల్ మామిడి మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నాం. అదనంగా 10 ఎకరాల స్థలం మామిడి మార్కెట్‌కు తీసుకోవడంతో పాటు రూ.7 కోట్లతో షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– నక్కల రాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

డిమాండ్ ఉంది



జిల్లాలో 50 వేల ఎకరాల వరకు, చుట్టుపక్కల జిల్లాలో మరో 30వేల ఎకరాల వరకు మామిడి సాగవుతోంది. ఇక్కడి కాయకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. రంగు, రుచితో పాటు ఎన్ని రోజులు రవాణా చేసినా చెడిపోదు అనే పేరుంది. మామిడికి ఉన్న డిమాండ్, వడగాల్పుల దృష్ట్యా కాయ ముదరక ముందే తెంపి, ఇతర రాష్ట్రాలకు పంపించడంతో ముక్కిపోతుంది.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

పద్మశాలీల ఐక్యతకు కృషి చేయాలి



మండలాల వారీగా సభ్యత్వ బుక్కులు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు

- పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం

కరీంనగర్: పద్మశాలీల ఐక్యతకు అందరూ కృషి చేయాలని, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో శనివారం జిల్లా కార్యవర్గంతోపాటు అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలు ఐక్యతను చాటి రాజకీయంగా ఎదగాలన్నారు. రాష్ట్ర పద్మశాలీ సంఘం పేరుతో కొంతమంది వ్యక్తులు చేపడుతున్న సభ్యత్వాలకు జిల్లా పద్మశాలీ సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. జిల్లా పద్మశాలీ సంఘంతో నిమిత్తం లేకుండా మండలాల వారీగా సభ్యత్వాలు నమోదు చేస్తున్నారని, ఆ సభ్యత్వాలు ఉన్నవారు జిల్లా పద్మశాలీ సంఘానికి సంబంధం లేదన్నారు. ఎవరు కూడా రాష్ట్ర పద్మశాలీ సంఘం సభ్యత్వం తీసుకోకూడదని కోరారు. జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాలు తీసుకునేవారు అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు సభ్యత్వ నమోదు బుక్స్‌ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగలవారు రూ.500 చెల్లించి శాశ్వత సభ్యులుగా నమోదు కావలసిందిగా కోరారు. జిల్లా పద్మశాలీ సంఘం అనుబంధ సంఘాల అధ్యక్షులు గడ్డం శ్రీరాములు, పోలు సత్యనారాయణ, గుడిమల్ల శ్రీకాంత్ జిల్లా నాయకులు రుద్రరాజు, అలుస భద్రయ్య, ఒడ్నాల రవీందర్, స్వర్గం నర్సయ్య, చక్కని ప్రభాకర్ సబ్బని రాజేందర్, మంచికట్ల కోటేశ్వర్, తిరుమల జయేందర్, వంగర రవీందర్, చిలక నర్సప్ప వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసుపెట్టి మిల్లు మూసేసినా ధాన్యం తీసుకోను

- సివిల్ సప్లయి అధికారులకు తేల్చిచెప్పిన రైసుమిల్లరు
- నాణ్యతసాకుతో ధాన్యంలో కోతపెట్టడంతో మంత్రి గంగులకు రైతుల ఫిర్యాదు



రైసుమిల్లర్లతో చర్చిస్తున్న డీఎం శ్రీకాంత్

కరీంనగర్‌రూరల్: కేసుపెట్టి రైసుమిల్లు మూసేసినా నాణ్యత లేని ధాన్యాన్ని తీసుకునేది లేదని ఓ రైసుమిల్లరు ఖరాఖండిగా తేల్చిచెప్పడంతో సివిల్ సప్లయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఖంగు తినాల్సి వచ్చింది. శనివారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ కొనుగోలు కేంద్రం నుంచి స్థానిక హర్షిణి రైసుమిల్లుకు రెండు ట్రాక్టర్లలో ధాన్యం లోడ్ పంపించారు. ధాన్యంలో నాణ్యత లేదంటూ బస్తాకు కిలో కటింగ్‌కు అంగీకరిస్తేనే దించుకుంటామని రైసుమిల్లరు చెప్పడంతో రైతులు మంత్రి గంగుల కమలాకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. మంత్రి ఆదేశంతో సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారి సురేశ్, తహసీల్దార్ నారాయణ రైసుమిల్లుకు వచ్చారు. అధికారులు వచ్చారనే సమాచారంతో సర్పంచు జక్కం నర్సయ్య, ఉప సర్పంచు కూకట్ల తిరుపతి, సింగిల్‌విండో డైరెక్టర్లు కందుల రమేశ్, దాడి లచ్చయ్య, అంజిరెడ్డితోపాటు పలువురు రైతులు అక్కడికి చేరుకున్నారు. ధాన్యం నాణ్యత లేకపోవడంతోనే అన్‌లోడింగ్ చేసుకోవడంలేదని రైసుమిల్లర్లు గోపాల్‌రావు, శ్రీనివాస్ అధికారులకు చెప్పారు. ధాన్యం చూపించి ఇలాంటి ధాన్యం తమకు అవసరంలేదని, కేసులు పెట్టి మిల్లు మూసేసినా ఫర్వాలేదనడంతో రైతులు ఆగ్రహించారు. ఇప్పటికే 42కిలోలు కాంటా పెడుతున్నారని, మళ్లీ నాణ్యత పేరుతో బస్తాకు కిలో కటింగ్ చేస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. మొగ్దుంపూర్ ధాన్యం తమకు అవసరం లేదనడంతో రైసుమిల్లు దుమ్ముతో పంటలన్నీ దెబ్బతింటున్నాయని వెంటనే మిల్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేందుకు రైతులతోపాటు మిల్లర్లు సహకరించాలని సివిల్ సప్లయి అధికారులు సర్దిచెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంగళవారం నుంచి అదనంగా మరో రైసు మిల్లును కేటాయిస్తామని సివిల్ సప్లయి డీఎం శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

తడిసి,మొలకెత్తిన ధాన్యం కొనాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హుజూరాబాద్: తడిసి, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లుల దగ్గర ధాన్యం దిగుమతి త్వరగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం హుజూరాబాద్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతిపక్షాల అంటే కేసీఆర్‌కు చిన్నచూపని, రైతుసంఘాలు అంటే లెక్కలేదన్నారు. కొనుగోలు సెంటర్ల కోసం ప్రభుత్వం ఎక్కడా ముందస్తు ఏర్పాట్లు చేయలేదని అన్నారు. మిల్లులు తక్కువగా కేటాయించడం వల్ల ఒక్కో మిల్లుదగ్గర నాలుగు ఐదు రోజులు ధాన్యం దింపుకోవడం లేదని, రైతులకు దిక్కులేక రూ.2020ల ధాన్యం ప్రైవేట్‌కు రూ.1300 వందలకే అమ్ముకుంటున్నారని తెలిపారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 20శాతం ధాన్యం మాత్రమే మిల్లులకు చేరిందని, ఇంకా 80 శాతం కల్లాల్లోనే ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు, పోలీసులు ఇసుక మాఫియాకు అండగా ఉండి మానేరును బొందల గడ్డగా మారుస్తున్నారని ఆరోపించారు. దళితబంధు ఇచ్చిన కొన్నిచోట్ల డబ్బులు తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయన్న సీఎం కేసీఆర్‌కు నిజాయితీ ఉంటే పేర్లు బయట పెట్టి వారిని బర్తరఫ్ చేయాలన్నారు. మానేరు వాగు మీద పర్యావరణ అనుమతి లేదని ఫిర్యాదు చేశామని, న్యాయ వ్యవస్థ మీద విశ్వాసం ఉందన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రాజు,శ్యాంసుందర్‌రెడ్డి, సంజీవ్ పాల్గొన్నారు.

ఐఐటీ- జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్.పవన్ సూర్య 220వ ర్యాంక్, బి.భవ్య 748, పల్లె బిందు 1,482, యూ.మోహన్ సాయి 2,347, బి.సాయిచరణ్ 4,652, అర్.అనన్యరెడ్డి 10,299, ఎం.ఈశ్వర్ నాయక్ 10,482, కె.మాధురి 10,712 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఎస్.పవన్ సూర్య 99.98, యూ.మోహన్ సాయి 99.10, పి.బిందు 99.08, డి.హారిక 98.11, కె.మాధురి 96.60, డి.వంశీకృష్ణ 95.38, ఆర్.అనన్యరెడ్డి 94.44, జి.రామక్రిష్ణ రెడ్డి 91.88 శాతంసాధించారు. పరీక్షకు హాజరైన 60శాతం మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. విద్యార్థులను చైర్మన్ రమేశ్‌రెడ్డి ,కళాశాలల డీన్ జగన్ మోహన్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధక్రిష్ణ, ఎజియం. శ్రీనివాస్ అభినందించారు.

శ్రీ చైతన్య కరీంనగర్ ఐపీఎల్ విద్యార్థుల సత్తా

కరీంనగర్: జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య కరీంనగర్ ఐపీఎల్ పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఆల్ ఇండియా విభాగంలో ఎం.రిషికేష్ 84వర్యాంక్, మణి శరవన్ గౌడ్ 260వ ర్యాంక్, జిందం శ్రీనాథ్ 495, కే.సాయి బాలాజీ 1218, ఏ శశిర్ 1352, బి.అరుణ్ 1723, ఎం.హర్షిత్ 4202, పి.మేఘన 5228, కే.మల్లికార్జున వరప్రసాద్ 6858, జె.శ్రీజ 8335, అర్.అభిజ్ఞ 10542, పి.కీర్తి 11749వ ర్యాంక్ సాధించారని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఆశయాలను, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక విద్యావేదిక శ్రీ చైతన్య కరీంనగర్ ఐపీఎల్ పాఠశాలని కరీంనగర్ ఆర్ఐ రాజు తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ , డైరెక్టర్ శ్రీవిద్య ,డీజీఎం లక్ష్మణరావు, శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్ పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ర్యాంక్‌లను వెల్లడిస్తున్న పాఠశాల బృందం

‘విద్యామందిర్’ విజయ దుందుభి

కరీంనగర్: జేఈఈ(మెయిన్స్) ఫలితాలలో విద్యామందిర్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. టి.శరావణ్ 260వ ర్యాంక్, బి.మనస్విని 1115వ ర్యాంక్ సాధించారు. 1200లోపు ఇద్దరు విద్యార్థులు, 10000లోపు ఎనిమిది మంది, 20000లోపు 12 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. కరీంనగర్ బ్రాంచ్ నుంచి టి.శరావణ్ 99.88, వి.ప్రణవ 99.45, ఆడేపు మిథిల్ 98.01, పి.వివేక్ వర్ధన్ 97.08, బొడ్ల వర్షిణి 96.01, వి.అవినాష్ 95.93, ఎస్.సాత్విక 95.92తో ప్రతిభ చాటారు. 41.42 శాతం మంది విద్యార్థులు జేఈఈ–అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్ జిల్లా రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు టీఎస్‌యూటీఎఫ్ భరోసా

విద్యానగర్(కరీంనగర్): ఆకస్మికంగా మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక చేయూతనివ్వడానికి కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని మే 2న ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి గోల్కొండ శ్రీధర్ తెలిపారు. శనివారం కరీంనగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో సంక్షేమనిధికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కుటుంబ సంక్షేమనిధి పథకం మే 2న నల్గొండ జిల్లాలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేతుల ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకం జూన్ 1నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఈ పథకంలో గరిష్టంగా 5వేల మంది సభ్యులను చేర్పిస్తామన్నారు. మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలకు ఈ పథకం ద్వారా 15 రోజుల్లోగా రూ.5 లక్షలను తక్షణ ఆర్థిక సాయంగా అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో చేరేవారు సభ్యత్వ రుసుము రూ.200, రిఫండబుల్ డిపాజిట్‌గా రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రిఫండబుల్ డిపాజిట్ ఉద్యోగి రిటైర్ అయినప్పుడు లేదా ఉద్యోగం కోల్పోయినప్పుడు వడ్డీతో కలిపి తిరిగి చెల్లించబడుతుందన్నారు.



కుటుంబ సంక్షేమ నిధికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోల్కొండ శ్రీధర్